## క్లుప్తంగా

### నవోదయ విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ త్రినాథ్

**పెద్దాపురం:** విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు జవహర్ నవోదయ విద్యాలయం ఎంతగానో దోహదపడుతుందని ప్రముఖ డయాబెటిక్ స్పెషలిస్ట్, విద్యాలయ పూర్వ విద్యార్థి డాక్టర్ సీహెచ్ త్రినాథ్ అన్నారు. నవోదయ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను నవోదయ విద్యార్థినని చెప్పుకోవడానికి గర్వపడుతున్నానన్నారు. ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య మాట్లాడుతూ, ఈ విద్యాలయ జిల్లాలో చాలా మంది విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇచ్చిందన్నారు. ఇక్కడ చదువుకున్న వారు ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. విద్యతో పాటు క్రమశిక్షణ, జాతీయ సమైక్యత విద్యాలయకే సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ సనపల సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఆర్.సత్యనారాయణ, మూర్తి, నారాయణ, నాగేశ్వరరావు, పృథ్వీ, వినీత మౌర్య, డి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### బాధితురాలికి ఆర్థిక సాయం

**పిఠాపురం:** పట్టణంలోని జగయ్య చెరువుకు చెందిన కేసబోయిన నవీన కొంతకాలంగా అనారోగ్యంతో నికి గురై బాధపడుతోంది. గుడ్ ఫ్రెండ్స్ చారిటీ సభ్యులు ఆదివారం రూ.50 వేల ఆర్థికసాయం, నిత్యావసర సరకులను అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్, రాయుడు శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

### మరిడమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

**పెద్దాపురం:** కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

### నూకాలమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు


ఆలయంలో క్యూలో ఉన్న భక్తులు


కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారు

**పెద్దాపురం:** మండలంలోని కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. కొత్త అమవాస్య మాసం పురస్కరించుకుని సుమారు 45 రోజుల పాటు నిర్వహించే జాతర మహోత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ ఆర్.సౌజన్య ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలతో తరలిరావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. పెద్దాపురం సీఐ విజయ్‌శంకర్ పర్యవేక్షణలో ఎస్సై మౌనిక బందోబస్తు కల్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. యాత్రికులకు మజ్జిగ, పాలు పంపిణీ చేశారు.

### ప్రభుత్వ కళాశాలలో 74 శాతం ఉత్తీర్ణత

**సామర్లకోట:** పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థులు ఇంటర్ ఫలితాలు విడుదల మేరకు 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రు లీలాశ్రీదేవి తెలిపారు. ఒకేషనల్‌లో 112 మందికి 95 మంది ఉత్తీర్ణత సాధించి 85 శాతం, జనరల్‌లో 73 మందికి 42 మంది ఉత్తీర్ణులై.. 42 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు చెప్పారు. దాంతో ఇంటర్ సెకండియర్‌లో 74 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ఫస్టియర్ ఒకేషనల్‌లో 130 మందికి 77 మంది ఉత్తీర్ణులు కాగా, జనరల్‌లో 102 మందికి 35 మంది ఉత్తీర్ణులు కావడంతో 48 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు వివరించారు.

**బాలికల కళాశాలలో..**

స్థానిక బ్రౌన్‌పేటలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను జూనియర్ కళాశాలగా గుర్తించారు. ఇందులో ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో 67 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ యు.మీనామాధురి తెలిపారు. ఎంపీసీలో 9 మందిలో ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. బైపీసీలో 12 మందిలో 8 మంది ఉత్తీర్ణులు కావడంతో 67 శాతం ఉత్తీర్ణత సాధించినట్టయింది. ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో ఆరుగురులో ఒకరు, బైపీసీలో 14 మందికి 8 మంది ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ వివరించారు.

# దారీతెన్నూ ఏదీ..?

- పట్టణంలో వన్ వే అమలుకు తూట్లు
- పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య
- సిబ్బంది కొరతతో చేతులెత్తేసిన యంత్రాంగం


సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో ఏర్పడిన ట్రాఫిక్ జామ్

**సామర్లకోట:** జిల్లాకు ముఖ్య కూడలి ప్రదేశమైన సామర్లకోటలో వన్ వే అమలుకు తూట్లు పొడిచారు. ఒకటిన్నర దశాబ్దాలుగా పట్టణంలో వన్ వే అమలులో ఉండేది. పెద్దాపురం-సామర్లకోట రోడ్డు నిర్మాణం, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం నుంచి ఇండస్ట్రియల్ ఎస్టేట్ రోడ్డులో నిర్మాణాలతో వన్ వేకు బ్రేక్ ఇచ్చారు. ఈ క్రమంలో పోలీసు సిబ్బంది బదిలీలు కూడా జరిగాయి. కొత్తగా వచ్చిన వారికి పట్టణంలో గతంలో వన్ వే అమలులో ఉన్న విషయం తెలియక పట్టించుకోవడం లేదు. సామర్లకోట సీఐగా ఎన్నికలకు ముందు బాధ్యతలు స్వీకరించిన అంకబాబు.. వన్ వేపై దృష్టి సారిస్తారని ఆశించగా, మూడు రోజులకే ఆయన బదిలీపై వెళ్లిపోయారు. పట్టణంలో వన్ వే అమలు చేయకపోవడంతో ట్రాఫిక్ సమస్య పెరిగిపోయింది. నిత్యం ఉదయం, సాయంత్రం ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. పెద్దాపురం రోడ్డులో మఠం సెంటర్, పిఠాపురం రోడ్డులో బట్టల బజార్ వద్ద తరచూ వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. పిఠాపురం రోడ్డులో ఏలేరు కాలువపై వంతెన నిర్మాణం పూర్తి కావడంతో, పిఠాపురం నుంచి భారీ వాహనాల రాకపోకలు ఇటీవల గణనీయంగా పెరిగాయి.

**నిబంధనలకు నీళ్లు**

**సామర్లకోట రైల్వే స్టేషన్, బస్సు కాంప్లెక్స్ నుంచి పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు వెళ్లే వాహనాలు** పెద్దాపురం రోడ్డులో వెళ్లాల్సి ఉంటుంది. అలాగే పెద్దాపురం, పిఠాపురం, ప్రత్తిపాడు నుంచి వచ్చే భారీ వాహనాలు పిఠాపురం రోడ్డు మీదుగా రావాల్సి ఉంది. ఆయా నిబంధనలను పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పిఠాపురం రోడ్డులో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా మున్సిపల్ హైస్కూల్, మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలు ఉన్నాయి. అదే విధంగా పెద్దాపురం రోడ్డులో మఠం సెంటర్ నుంచి బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దాంతో ఆయా ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువ. పట్టణంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయం, ప్రత్తిపాడు జంక్షన్, బ్రౌన్‌పేట, బళ్ల మార్కెట్, గాంధీచౌక్, పోలీసు రింగ్ సెంటర్, మఠం సెంటర్, మెహర్ కాంప్లెక్స్‌ల వద్ద పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే సిబ్బంది కొరత పేరుతో ట్రాఫిక్‌ను గాలికి వదిలేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సిబ్బంది కొరత ఉన్న సమయంలో వన్ వేను కచ్చితంగా అమలు చేస్తే, ట్రాఫిక్ సమస్యకు చెక్ పడుతుందనే వాదనలూ లేకపోలేదు. కేవలం ట్రాఫిక్ సిబ్బంది ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై మాత్రమే విధుల నిర్వహణకు పరిమితమయ్యారనే విమర్శలున్నాయి.

**తిరిగి అమలు చేయాలి**



గతంలో ఉండే వన్ వేను తిరిగి అమలు చేయాలి. బళ్ల మార్కెట్ సెంటర్, మఠం సెంటర్‌ల్లో సాయంత్రం వేళ రద్దీగా ఉంటుంది. ఆయా ప్రదేశాల్లో మద్యం షాపులున్నాయి. ఏలేరు కాలువపై వంతెన పూర్తి కావడంతో పిఠాపురం రోడ్డులో వాహనాల రద్దీ పెరిగింది. దాంతో నిత్యం ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. సామర్లకోట-పెద్దాపురం రోడ్డు విస్తరణ పనుల కారణంగా కొంత కాలం వన్ వేను నిలిపివేశారు. గతంలో ఉన్న సీఐలకు వన్ వేను తిరిగి అమలు చేయాలని వినతిపత్రాలు అందజేశాం.

– వారా సుధాకర్, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్, సామర్లకోట

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం**



పట్టణంలో గతంలో ఉండే వన్ వేను అమలు చేయడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం. వన్ వే కచ్చితంగా అమలు చేయడం వలన కొంత మేరకు ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది. గతంలో ఉండే వన్ వేను అమలు చేయడం తప్పు కాదు. ప్రారంభంలో కొంత కష్టంగా ఉన్నా, వన్ వే అమలు జరిగితే సుఖవంతమైన ప్రయాణానికి అవకాశం ఉంటుంది. రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతోంది. వన్ వేకు సంబంధించి ఫ్లెక్సీ బోర్డు ఏర్పాటు చేయాలి.

– అడపా గరగారావు, ట్రాఫిక్ ఎస్సై, సామర్లకోట

### నూకాలమ్మకు విశేషాలంకరణ


సామర్లకోట నూకాలమ్మ అమ్మవారు

**సామర్లకోట:** పట్టణంలోని స్టేషన్ సెంటర్‌లో ఉన్న నూకాలమ్మ అమ్మవారిని పూలతో విశేషాలంకరణ చేశారు. కొత్త అమావాస్యను పురస్కరించుకుని ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో నెల రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం పూలతో చేసిన అలంకరణను తిలకించడానికి భక్తులు బారులు తీరారు. పంచారామ క్షేత్ర దీపారాధన సంఘ సభ్యులు అమ్మవారి అలంకరణ చేశారు. పారాయణ కమిటీ అధ్యక్షురాలు సత్తి అరుణ ఆధ్వర్యంలో పారాయణ నిర్వహించారు. భక్తులకు యార్లగడ్డ శ్రీనివాసు, గోలి రాంబాబు, ఉండవిల్లి శ్రీనివాసు, ప్రకాశం సేవలందించారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీపుష్పయాగోత్సవం


స్వామివారు, అమ్మవార్లకు పూజలు చేస్తున్న అర్చకులు


ఊయల మంటపంలో స్వామి, అమ్మవార్లు

**సామర్లకోట:** పురాతన విష్ణు ఆలయమైన శ్రీదేవి, భూదేవి సమేత మాండవ్య నారాయణ స్వామి శ్రీపుష్పయాగోత్సవం ఆదివారం రాత్రి నేత్రపర్వంగా జరిగింది. ఈ నెల 7వ తేదీ నుంచి ఆలయంలో స్వామివారి కల్యాణ ఉత్సవాలు ప్రారంభమైన విషయం విదితమే. ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని స్వామి, అమ్మవార్ల శ్రీపుష్ప యాగోత్సవం నిర్వహించారు. ఆలయ మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై పట్టు వస్త్రాలతో అలంకృతులైన స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ పండితులు పూజలు చేశారు. ఖండవిల్లి దుర్గప్రశాంతాచార్యులు, చక్రవర్తుల రవికుమార్ ఆచార్యులు, రఘురామ్ ఆచార్యులు, పద్మనాభాచార్యులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూలతో అలంకరించిన ఊయలలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి, పూలు, పండ్లు, మిఠాయిలను నైవేద్యంగా ఏర్పాటు చేశారు. దంపత తాంబూలం, ప్రసాద వితరణ జరిగాయి. ఆలయ ఈఓ బిక్కిన వెంకట్రాయచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవాలు నిర్వహించారు.

# ధాన్యం కొనుగోళ్లు లేవు

- కొనేవారు లేక దళారులకు విక్రయాలు
- ప్రభుత్వం పట్టించుకోవడం లేదు
- మాజీ ఎంపీ వంగా గీత వద్ద రైతుల ఆవేదన


వంగా గీతకు తమ సమస్యలు వివరిస్తున్న రైతులు

**పిఠాపురం:** ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనేవారు లేక దళారులు పాలు చేయాల్సి వస్తుందని, అప్పులపాలై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత ఆదివారం గొల్లప్రోలు మండలం చేబ్రోలు, లక్ష్మీపురం, సీతానగరం, మల్లవరం గ్రామాల్లోని దాళ్వా సాగు చేసిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలును తెలుసుకున్నారు. గిట్టుబాటు ధర లేదని, సకాలంలో ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఈ సందర్భంగా రైతులు ఆమె వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు రైతులు, కౌలు రైతులు మాజీ ఎంపీ గీత వద్ద తమ సమస్యలు ఏకరువు పెట్టారు. గతేడాది సాధన వరి రకం బస్తా రూ.1,700కు, ఓం సాయి రకం రూ.1చ800 వరకు కొనుగోలు చేశారని, ఈ ఏడాది రూ.1,250కు మించి కొనుగోలు చేయడం లేదని పలువురు రైతులు తెలిపారు. అది కూడా నెల అరువు పద్ధతిలో అమ్మకం చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. బస్తాకు రూ.500 చొప్పున ఎకరాకు రూ.20వేలు నష్టపోతున్నామన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందన్నారు. ఇంత దారుణమైన పరిస్థితి ఎన్నడూ లేదన్నారు. రైతుల్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల తీవ్ర నష్టాలు పాలవుతున్నారని, ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆందోళనకు గురవుతున్నామని రైతులు ఆమె వద్ద వాపోయారు. అన్నదాతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్ల తీవ్ర మనస్తాపానికి గురవుతున్నామని చెప్పారు.

**గత ప్రభుత్వంలో నయం**

గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధైర్యంగా ధాన్యాన్ని అమ్ముకునే వారమని, గిట్టుబాటు ధర వచ్చి.. ఇబ్బందులు, నష్టాలు లేకుండా లాభాలతో వ్యవసాయం చేసేవారమని రైతులు తెలిపారు. ఇప్పుడు ధాన్యం కొనేవారు లేక, అప్పుల పాలయ్యే పరిస్థితిలో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, న్యాయం చేయాలని వంగా గీతను వేడుకున్నారు. రైతుల సమస్యలు సావధానంగా ఆలకించిన ఆమె వెంటనే జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు ఫోన్లు చేసి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఒకవైపు ధర లేక, మరోవైపు వాతావరణంలో మార్పుల వల్ల రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు, తక్షణం అధికారులు స్పందించి, ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. దీనిపై మిల్లర్లు, అధికారులతో మాట్లాడి, వెంటనే రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయిస్తామని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు.

## ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

**జిల్లా కలెక్టర్ షణ్మోహన్**


కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

**పిఠాపురం:** ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని, ఆహారం విషయంలో జాగ్రత్తలను పాటించాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో ఉన్న గజరాజు సీతారామస్వామి ఆసుపత్రి ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆసుపత్రి వారి పర్యవేక్షణలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ షణ్మోహన్, సంకురాత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పద్మశ్రీ, సంకురాత్రి చంద్రశేఖర్ ప్రారంభించారు. సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందించారు. అనంతరం ఆరోగ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ, వయస్సును బట్టి ఆరోగ్యంలో మార్పులు వస్తాయన్నారు. దీనినిబట్టే ఆహార నియమాలు పాటిస్తూ, వైద్యుల సలహాలు పాటించాలన్నారు. తీసుకునే ఆహారం వలనే ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కువ శాతం నీటిని తీసుకోవాలన్నారు. ఉప్పు, నూనెను తక్కువగా వాడాలన్నారు. కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవడం వలన పోషక విలువలు తగినంతగా శరీరానికి అందుతాయని చెప్పారు. ఈ శిబిరంలో 80 మందికి కంటి ఆపరేషన్‌కు సిఫార్సు చేశారు. ఈ శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు పూజారెడ్డి, రహీమున్నీసా, రావు నవీన్‌కుమార్, సి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### జూదరుల అరెస్టు

**కొత్తపల్లి:** పేకాట శిబిరంపై దాడి చేసి తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు, గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలు శివారు ఉన్న సత్తెమ్మ తల్లి ఆలయం సమీపంలో పేకాట ఆడుతున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై రామకృష్ణ వెంకటేష్ తమ సిబ్బందితో దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి, రూ.10,850 నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

## శృంగార వల్లభుడికి శ్రీపుష్పోత్సవం


శృంగార వల్లభుడికి శ్రీపుష్పోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

**పెద్దాపురం:** మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి దివ్య కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన శ్రీపుష్పోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శృంగార వల్లభుడు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్, సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యుల పర్యవేక్షణలో వేద పండితులు.. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శృంగార వల్లభుడికి శ్రీపుష్పోత్సవాన్ని కనుల విందుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవదాయ సిబ్బంది, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం


తండ్రి కుమార పరిశుద్ధాత్మ సంఘం ఆధ్వర్యంలో..


గొల్లప్రోలులో జరిగిన మట్టల ఆదివారం కార్యక్రమం

**సామర్లకోట:** పట్టణ, మండలంలోని క్రైస్తవులు ఆయా చర్చిల్లో భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రార్థనా మందిరాల నుంచి ఈత మట్టలకు పూలు అలంకరించి, వాటితో ర్యాలీలు చేశారు. క్రీస్తు యేరుషలేంలో ప్రవేశించి, దేవాలయాన్ని శుద్ధీకరించిన సందర్భాన్ని పురస్కరించుకుని క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం జరుపుకొన్నారు. పిల్లలు, పెద్దలు నినాదాలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలో ఆంధ్రా బాప్టిస్టు చర్చి, సెంటినరీ అగ్రస్థాన లూథరన్ చర్చి, సెంటినరీ బాప్టిస్టు చర్చి, సాలెమ్ బాప్టిస్టు చర్చిలలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని, ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దైవజనులు, సంఘ నాయకులు, యువ నాయకులు ప్రార్థనలు చేశారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

**రాజాధిరాజు ఏసు**

**పెద్దాపురం:** యావత్ ప్రపంచానికి రాజాధిరాజు ఏసు ప్రభువేనని క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరం దైవజనులు నంగిన సత్యానందం, నంగిన శామ్యూల్ సుదీప్ అన్నారు. మట్టల ఆదివారం పర్వదినాన్ని పురస్కరించుకుని పెద్దాపురం మండలం దివిలి, తిరుపతి, చదలాడ, కాండ్రకోటతో పాటు, పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని ఆయా చర్చిల్లో విశ్వాసులు మట్టల ఆదివారం ర్యాలీ నిర్వహించారు. మట్టలతో మహిళలు రోడ్లపై భారీ ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని తండ్రి కుమార పరిశుద్ధాత్మ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ర్యాలీ ఘనంగా నిర్వహించారు స్థానిక కబడ్డీ వీధిలోని రౌతు సూరిబాబు ఇంటి నుంచి మెయిన్ రోడ్డు, సారావారి వీధి మీదుగా కట్టమూరు రోడ్డులో ఉన్న స్వస్థత శాల వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని స్థానిక బైబిలు మిషన్ స్వర్ణ దేవాలయం ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక లూథరన్ స్కూల్ వెనుక ఉన్న బైబిలు మిషన్ చర్చి నుంచి మహిళలు మట్టలతో భారీ ర్యాలీలో పాల్గొన్నారు.

**పిఠాపురం:** నియోజకవర్గంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని ఆంధ్రా బాప్టిస్టు సంఘం చిల్డ్రన్ అండ్ యూత్ ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. వీధుల్లో శాంతియాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కాపరి మంగమ్ జాన్ ప్రసాద్‌కుమార్, ఇతర నాయకులు పాల్గొన్నారు.


వాకతిప్పలో మట్టల ఆదివారం

**కొత్తపల్లి:** మండలంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాకతిప్ప, కొత్తపల్లి, ఉప్పాడలోని ప్రార్థనా మందిరాల పాస్టర్ల ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా జరిగింది. చిన్నారులు వీధుల్లో శాంతియాత్ర నిర్వహించారు.


సామర్లకోటలో నిర్వహిస్తున్న మట్టల ఆదివారం ర్యాలీ


దివిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న సండే స్కూలు చిన్నారులు

## అకాల వర్షంతో బీభత్సం

- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- అంధకారంలో గ్రామాలు


వాకతిప్పలో కూలిపోయిన రేకుల షెడ్డు

**కొత్తపల్లి:** ఆకస్మికంగా మారిన వాతావరణంతో ఆదివారం రాత్రి గాలివాన బీభత్సాన్ని సృష్టించింది. అకాల వర్షం, ఈదురు గాలులతో పాటు పిడుగులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో చెట్లు కూలాయి. దీంతో తీగలు తెగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అనేక గ్రామాలు అంధకారంగా మారాయి. అకాల వర్షంతో రైతులు బెంబేలెత్తారు.

**హడలెత్తిన ప్రజలు**

**సామర్లకోట:** ఆదివారం రాత్రి ఆకస్మికంగా ఈదురు గాలులు, భారీ వర్షం బీభత్సం సృష్టించడంతో ప్రజలు హడలిపోయారు. ఈదురు గాలులకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తర్వాత ఉరుములు, పిడుగులతో భారీ వర్షం కురవడంతో, ప్రయాణికులు ఎక్కడికక్కడే వాహనాలను నిలిపి సురక్షిత ప్రాంతాలకు చేరారు. ఈ క్రమంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ అధికారులు ముందుజాగ్రత్తగా విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.